

లేత ప్రాయం. కల్లాకపటం తెలియని వయస్సు. నేను టెన్త్ పాసయి ఇంటర్‌లో జాయిన్ అయిన రోజులు. ఇంత వరకూ ఆడపిల్లల స్కూల్లో చదివిన నేను కోఎడ్యుకేషన్ కాలేజీలో జాయిన్ అయినాను. పదహారేళ్ళ వయసు-లోకం అంతా పచ్చగా కనిపిస్తుంది ఆవయసులో హుషారు, సరదా చెప్పలేం అబ్బ! వెళ్ళి పోయిన ఆ రోజులు మాత్రం మనసులో తీయని ముద్ర వేస్తాయి. ఆ రోజుల్లో ఒరువూ. బాధ్యతలూ ఉండవు చదువుకోవడం-నిద్రపోవడం ఎంత నిశ్చింతగా ఉండేది. నేనూ, నా ఫ్రెండ్స్ ఇద్దరం ముగ్గురం కలసి కాలేజీకి వెళే వాళ్ళం. మేం ముగ్గురం చిన్నతనం నుండి క్లాస్‌మెట్స్‌మే. జాయిన్ అయిన కొత్తలో బుద్ధిగా వుండే వాళ్ళం. హైస్కూల్ అల వాట్లు పోలేదు మూడు నాలుగు నెలలు పోయాక కొత్త పోయింది. సాధారణంగా హుషారుగా, అల్లరిగా ఉండే మేం ముగ్గురం పూర్తిగా కొత్త పోవటం వలన, సహజంగా అల్లరి వాళ్ళం అవటం వలన కాలేజీలో కూడా అల్లరి మొదలు పెట్టాం.

అందరికీ నిక్‌నేమ్స్ పెట్టడం, ఏడిపించడం. (మనలో మన మాట-మా ముగ్గురికీ కలిపి కూడా పెట్టేశారు ముక్కోటి దేవతలు అని) ఎవరికీ చెప్పకండేం!

అయితే సెకండియర్‌లో ఓ కొత్త అమ్మాయి వచ్చింది. వాళ్ళ నాన్నగారిక్కి ఏదో ఊరు నుండి ఇక్కడికి ట్రాన్స్‌ఫర్ అయినట్టు చెప్పింది. అప్పటికి మాకు పూర్తిగా ధైర్యం వచ్చేసింది. సీనియర్స్ అయిపోయాం. ఇక మా అల్లరికి అంతు లేదు. అందులో కొత్త వాళ్ళంటే మహా సరదా. పాపం! వాళ్ళు ఏమన్నా పడతారు కదా! ఆ అమ్మాయి తెల్లగా, అందంగా, నాజూగ్గా, సుకుమారంగా ఉండేది. ఆ అమ్మాయికి వెంటనే గాజు బొమ్మ అని పేరు పెట్టేశాను నేను. ఆ అమ్మాయి చాలా పిరికిది. ఆ అలుసు చూసుకొని నేనూ నా ఫ్రెండ్స్ ఇద్దరూ అందరం కలసి మరింత ఏడిపించే వాళ్ళం-అందులో నేను మరీను.

ఆ చిలిపి వయసు అలాంటిది. అల్లరి చేయడం తప్ప మంచీ, చెడూ అనే విచక్షణా జ్ఞానం ఉండదు. లోకంలో ఉన్న ఆనందం అంతా తామే అందుకుంటున్నట్లు అనుభూతి పాల పొంగులాంటి వయసు పాలు పొంగి పొయ్యిలో పడితే ఎంత ప్రమాదమో ఆ వయసులో అల్లరి కూడా అలాంటిదే.

మా క్లాస్‌లో శేఖర్ అనే కుర్రాడు ఉండేవాడు అతనికి "పూరీ" అని పేరు పెట్టాం. (ఎందుకు పెట్టామో సరిగ్గా గుర్తు లేదుమరి) నేను ఓ ప్లాన్ వేశాను. ఆ కొత్త అమ్మాయిని ఎలా అయినా ఏడిపించాలని మా ఫ్రెండ్స్‌తో ముచ్చటించాను. ముగ్గురం కలసి ఆ ప్లాన్‌ని అమలు పరిచాం.

"గాజు బొమ్మ" అసలైన పేరుతో శేఖర్‌కి ఓ ప్రేమలేఖ వ్రాసి, అతను బయటకు వెళ్ళినపుడు అతని నోట్స్‌లో పెట్టేశాం.

ఆ మర్నాడు చూడాలి గోల. ఆ శేఖర్ అసలే బుద్ధిమంతుడు. వెళ్ళి ప్రిన్స్‌పాల్‌కి లెటర్ చూపించి "గాజు బొమ్మ" మీద కంప్లయింట్ ఇచ్చాడు.

"గాజు బొమ్మ" ని పిలిపించాడు ప్రిన్స్‌పాల్.

నేను వ్రాయలేదని చెప్పింది, అసలే పిరికిదేమో ముందే ఏడుపులోకి దిగింది. ఏడుపు చూసి ఆమే రాసిందని చీవాట్లు పెట్టడం ఆ "చెంచా" (అదేలెండి ప్రిన్స్‌పాల్‌కి ముద్దుగా ఆ పేరు పెట్టాం మేమే)

"కుదురుగా చదువు కోడానికి వస్తున్నారా? ఇలా అల్లర్లు చేయడానికా" అంటూ అందర్నీ కలిపి ఓ సారి తిట్టేశాడు. ప్రిన్స్‌పాల్, "గాజు బొమ్మ"ని సస్పెండ్ చేశాడు. ఇంక కాలేజీ అంతా పాకిపోయింది. ఒక అమ్మాయి అబ్బాయికి ప్రేమలేఖ ధైర్యమే మరి నిజంగా ఈ గొడవలన్నీ తెలిసి ఆ అమ్మాయి వాళ్ళ వాళ్ళు కాలేజీ మాన్పించేశారు. కాని వచ్చిన మచ్చ పోదు కదా! ఇంట్లోవాళ్ళు, బయటివాళ్ళు ఆ అమ్మాయిని సూటి పోటి మాటలతో బాధ పెట్టేశారు ఆ బాధ భరాయించలేక ఆ అమ్మాయి ఆత్మ హత్య చేసుకుంది. ఆ అమ్మాయి చావు నాకు షాక్ ఇచ్చిందనే చెప్పాలి. కేవలం తెలిసీ తెలియని చిలిపి వయసులో చేసిన వెధవ పనికి నిండు ప్రాణం బలి అయిపోయింది. అప్పుడు నాకు కలిగిన బాధ వర్ణించలేనిది. కానీ ఆ అమ్మాయి ప్రాణం తిరిగి తెప్పించలేముగా. అప్పటి నుండి ఎంతో జాగ్రత్తగా ఉండేదాన్ని మన వలన ఇతరులకి జరిగిన అన్యాయం ఒక్కోసారి ఎంత ఘోరంగా ఉంటుందో ఇదే ఉదాహరణ. కల్లాకపటం తెలియని ఆ వయసులో కళ్ళెం లేని గుఱ్ఱంలా ఉంటుంటుంది కాస్త వదిలితే పరుగు పెడుతుంది. ఏ తప్పులూ చేయకుండా ఇంట్లో వాళ్ళు జాగ్రత్తగా చూసుకోవాలి.

శకుంతల